ఆపద వస్తే.. ప్రాణాలకు నో గ్యారంటీ!

- ఏలూరు జీజీహెచ్‌లో అత్యవసర సేవలు నిల్
- స్టాంప్ ఉంటేనే స్కానింగ్, ఎంఆర్ఐ?
- గగ్గోలు పెడుతున్న రోగులు

ఏలూరు టౌన్: రోడ్డు ప్రమాదమో, అనారోగ్యంతో అత్యవసర స్థితి వస్తే, ఆపద పరిస్థితుల్లో పేదలకు వైద్య చికిత్స అందే అవకాశం లేదు. ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు, చికిత్సలు అందుబాటులోకి వస్తాయనే ఆశలపై నీళ్లు చల్లుతున్నారు. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో అత్యవసర సేవలు అందటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే ప్రతి రోజూ ప్రాణాపాయ స్థితిలోని రోగులను విజయవాడ, గుంటూరుకు రిఫర్ చేస్తూ చేతులుదులుపుకుంటున్నారు. ఇక తాజాగా వైద్య నిపుణులను సైతం బదిలీ చేయటంతో పరిస్థితి మరింత క్లిష్టతరంగా మారే దుస్థితి ఏర్పడింది. ఏలూరు జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందే అవకాశం లేదని రోగులు వాపోతున్నారు.

భర్తీకాని వైద్య నిపుణుల పోస్టులు

ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా బోధనాసుపత్రిని అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. ఏలూరు జీజీహెచ్‌లో మొత్తంగా 78 మంది ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సూపర్ స్పెషాలిటీకి సంబంధించి అయా విభాగాలకు వైద్య నిపుణులను నియమించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం 38 మంది మాత్రమే వైద్యులు పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను కాపాడుకునే అవకాశాలు లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు జీజీహెచ్‌లో ట్రామాకేర్, ఐసీయూల్లో వైద్య నిపుణులు లేకపోవటంతో పరిస్థితి


ఏలూరు జీజీహెచ్ అత్యవసర సేవల విభాగం (ఫైల్)

మరింత విషమంగా మారింది. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు అత్యవసర వైద్య చికిత్సలు అందించేందుకు న్యూరోసర్జన్లు ఉండాలి. కానీ ప్రస్తుతం పనిచేస్తోన్న న్యూరో సర్జన్ బి.రవికుమార్‌ను అధికారులు బదిలీ చేశారు. గుండెపోటు వస్తే ప్రైవేటు హాస్పిటల్‌కు వెళ్లటం తప్ప మరో దారిలేదు. కార్డియాలజీ వైద్య పోస్టును భర్తీ చేయలేదు. యూరాలజీ వైద్య నిపుణులను సైతం ఏర్పాటు చేయకపోవటంతో ప్రజల ప్రాణాలకు భరోసా లేకుండా పోయింది.

స్కానింగ్, ఎంఆర్ఐపై అసంతృప్తి

ఏలూరు నగర ప్రజలు అనారోగ్యంతో జీజీహెచ్‌కు వెళితే స్కానింగ్, ఎంఆర్ఐ పరీక్షలకు ప్రజాప్రతినిధులు నియమించిన వ్యక్తుల సిఫార్సు కావాలంటూ సిబ్బంది చెప్పటం గమనార్హం. ఇటీవల నగరానికి చెందిన ఒక వ్యక్తి తీవ్ర అనారోగ్యంతో జీజీహెచ్‌కు వెళ్లగా వైద్యులు స్కానింగ్ తీయించుకోవాలని రాశారు. ఓపీ చీటీ తీసుకుని స్కానింగ్ సెంటర్‌కు వెళ్లగా దీనిపై ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి స్టాంప్ లేదని, స్కానింగ్ తీయకపోవడంతో రోగి బంధువులు అవాక్కయ్యారు. సరేలే అంటూ సదరు ప్రతినిధి కోసం ఆరా తీస్తే, ఆయన లేరని తెలిసింది. సిబ్బంది మాటలతో రోగుల బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా న్యూరో సర్జన్ రవికుమార్, జనరల్ ఫిజీషియన్ పోతుమూడి శ్రీనివాసరావు సైతం బదిలీ కావటంతో రోగుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది.

చికిత్సలు అందించటంలో విఫలం



ఏలూరు సర్వజన ఆసుపత్రిని అభివృద్ధి చేయటంతో పాటు, సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలి. అత్యవసర సేవలకు సంబంధించి నిపుణులైన వైద్యులను నియమించటం, ప్రతి వ్యక్తికీ ఉత్తమ వైద్య చికిత్స అందించేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. స్కానింగ్, ఎంఆర్ఐ వంటి పరీక్షలకు ప్రైవేటు స్కానింగ్ సెంటర్లకెళ్లి భారీగా డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. సామాన్య వర్గాల ప్రజలకు ఉచితంగా వైద్య చికిత్సలు, శస్త్ర చికిత్సలు అందించటంలో కూటమి ప్రభుత్వం విఫలం అవుతుందనే అభిప్రాయం ప్రజల్లో ఉంది.

– మామిళ్లపల్లి జయప్రకాష్, వైసీపీ ఏలూరు సమన్వయకర్త

వైద్యానికి అప్పు చేయాలి



ఏలూరు బోధనాసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య నిపుణులు పోస్టులు భర్తీ చేయాలి. ఏలూరు నగరం, పరిసర ప్రాంతాల ప్రజలకు ఏలూరు జీజీహెచ్‌లో మెరుగైన వైద్యసేవలు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలి. గుండె సంబంధిత వైద్య నిపుణులు లేరు. ప్రాణాపాయ స్థితిలో విజయవాడ, గుంటూరు వంటి దూరప్రాంతాలకు వెళ్లటం ఖర్చుతో కూడింది. ప్రైవేటు హాస్పిటల్స్ తీసుకువెళ్లటానికి సామాన్య ప్రజలు అప్పులు చేయాలి. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి ఏలూరు జీజీహెచ్‌లో వైద్యుల పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– ప్రత్తిపాటి తంబి, న్యాయవాది, ఏలూరు

క్లుప్తంగా

త్రో బాల్ పోటీలో థెరిస్సా విద్యార్థినులకు ప్రథమం


బహుమతి అందుకుంటున్న విద్యార్థినులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నిడదవోలులోని సెయింట్ ఆన్స్ హై స్కూల్‌లో ఈ నెల 22న నిర్వహించిన ఈస్టర్న్ ఇండియా పాఠశాల, కళాశాల స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల త్రో బాల్ విభాగంలో ఏలూరు నగరంలోని సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచారని పీడీ అండాళ్లు తెలిపారు. విద్యార్థినుల జట్టుకు ప్రొవిన్షియల్ సిస్టర్ సారీలు, ఎడ్యుకేషనల్ కౌన్సిలర్ ఆఫ్ ఈస్టర్న్ ప్రోవిన్స్ సిస్టర్ రజిత బహుమతి అందజేశారని పేర్కొన్నారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ ఫాతిమ డిగల్ ప్రత్యేకంగా అభినందించారు.

సెలవులపై పునరాలోచించండి


డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో పని చేస్తున్న ఉపాధ్యాయుల్లో 10 శాతానికి మించి సెలవులు మంజూరు చేయరాదని మండల విద్యాశాఖాధికారులకు, ప్రధానోపాధ్యాయులకు ఇచ్చిన ఆదేశాలను పునరాలోచించాలని జిల్లా విద్యాశాఖాధికారిని పీఆర్‌టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం డీఈఓకు యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఇటువంటి ఆదేశాల వల్ల అనారోగ్య, ఇతర సమస్యలతో ఉపాధ్యాయులు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారని పేర్కొన్నారు. పాఠశాల పాలనకు ఇబ్బందులు లేకుండా సెలవులు మంజూరు చేసే విధంగా ఆదేశాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు ఎస్‌కే మొహిద్దీన్ పాషా ఉన్నారు.

స్కాలర్‌షిప్ రాక ఇక్కట్లు

దెందులూరు: ప్రభుత్వం స్కాలర్‌షిప్ మంజూరు చేయకపోవడంతో గోపన్నపాలెం వ్యాయామ కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం కళాశాలలో వారు మాట్లాడుతూ కళాశాలలో అండర్ గ్రాడ్యుయేషన్ డిప్లమో బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రెండు వ్యాయామ విద్య కోర్సులు ఉన్నాయని, ప్రభుత్వం తమకు ఇబ్బందులు లేకుండా స్కాలర్‌షిప్ వెంటనే మంజూరు చేయాలని కోరారు.

నిత్యాన్నదానానికి విరాళం


దాతలకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఆలయ డీఈఓ రత్నరాజు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ) : ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి ఏలూరుకు చెందిన భక్తులు శనివారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఏలూరు గొల్లయిగూడెంకు చెందిన ఎ.వెంకటపతిరావు దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం అందించారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఆలయ డెప్యూటీ ఈఓ రత్నరాజు దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

జనవరి 5న హైందవ శంఖారావం


సమావేశంలో మాట్లాడుతున్న జనార్ధన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హిందూ ఆలయాల రక్షణకు జనవరి 5న విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావం బహిరంగ సభ విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ ఆంధ్రప్రదేశ్ సహ ప్రాంత ప్రచారక్ జనార్ధన్ పిలుపునిచ్చారు. స్థానిక అంబికా ఫ్లేవర్స్ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం ఏలూరు నగర హైందవ శంఖారావం సన్నాహక సమావేశం నిర్వహించారు. పలు హిందూ సంఘాల ప్రతినిధులు, విశ్వహిందూ పరిషత్, పరివార్ క్షేత్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి హిందువులు తరలి రావాల్సిన అవసరం ఉందన్నారు. హిందూ ఆలయాల్లో హిందూ ఉద్యోగులు మాత్రమే పని చేయాలని, ఇతర మతాల ఉద్యోగులను వెనక్కి పంపించాలనే పలు డిమాండ్లతో దేశంలోనే తొలిసారిగా ఈ హైందవ శంఖారావసభ ఏర్పాటుచేశామని చెప్పారు. సమావేశంలో హైందవ శంఖారావం నాయకులు కస్తూరి సూర్య ప్రకాష్, మేడిశెట్టి పాములు తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో 6,120 మంది విద్యార్థులు

ఏలూరు (టూటౌన్): జిల్లాలోని 59 ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో 6,120 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ వి.విజయ్ ప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని వసతి గృహాల్లో రూ.50 లక్షలు ఎంపీ ల్యాడ్స్‌తో మరమ్మతులు చేయించామని తెలిపారు. విద్యార్థులకు దుప్పట్లు బెడ్ షీట్స్, టంకుపెట్టెలు, కాస్మోటిక్స్ అందించామని పేర్కొన్నారు. విద్యా కానుకలో విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు ఇస్తున్నట్లు చెప్పారు.

సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట

ఏలూరు టౌన్ : జిల్లా పోలీస్‌శాఖ సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ఏలూరు సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన ఎస్సై డి.నరసింహారావు కుమారుడు దిగమర్తి సుందర్‌కు శనివారం ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ పోస్టును మంజూరు చేస్తూ నియామక పత్రం ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 60 రోజుల్లోనే ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు, ఉద్యోగ కల్పనకు చర్యలు చేపట్టామని చెప్పారు. దివంగత నరసింహారావు పోలీస్ శాఖలో 38 సంవత్సరాలు ఎనలేని సేవలు అందించారని గుర్తుచేసుకున్నారు. తండ్రి పేరు నిలబెట్టాలని ఎస్పీ సూచించారు. త్వరి


ఉద్యోగ నియామక పత్రం అందిస్తున్న ఎస్పీ శివకిషోర్

తగతిన ఉద్యోగ కల్పనకు కృషి చేసిన ఎస్పీ శివకిషోర్‌కు నరసింహారావు సతీమణి, కుమారుడు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

తల్లి చెంతకు బాలుడు

ఏలూరు టౌన్ : ఏలూరు శాంతినగర్‌కు చెందిన బాలుడు తల్లి మందలించటంతో ఇల్లు వదిలి బయటకొచ్చాడు. ఆందోళనకు గురైన తల్లి గుడివాడ గంగాభవానీ శుక్రవారం రాత్రి డయల్ 112కు ఫోన్ చేసి తమ పిల్లాడు ఇంటి నుంచి వెళ్లిపోయాడంటూ ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన టూటౌన్ సీఐ వైవీ రమణ ఆధ్వర్యంలో మహిళా ఎస్సై నాగకళ్యాణి తన సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడు ఏలూరు రైల్వే స్టేషన్‌లో రాజమహేంద్రవరం వెళ్లే రైలు ఎక్కేందుకు వేచి ఉండగా గుర్తించారు. టూటౌన్ స్టేషన్‌కు తీసుకొచ్చి బాలుడికి ఎస్సై నాగకళ్యాణి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం బాలుడ్ని తల్లి భవానీకి అప్పగించారు. వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.


బాలుడ్ని తల్లి చెంతకు చేర్చిన ఎస్సై నాగకళ్యాణి

సైబర్ నేరగాళ్లకు వృద్ధులే టార్గెట్

ఏలూరు (టూటౌన్) : సైబర్ నేరగాళ్లు వృద్ధులనే టార్గెట్ చేస్తుండడంతో డిజిటల్ లావాదేవీల పట్ల జాగ్రత్తగా ఉండాలని డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ అన్నారు. ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న వృద్ధుల కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఏపీకే యాప్‌లు, మెసేజ్లు, లింకును ఓపెన్ చేస్తే ఖాతాదారుల రహస్య సమాచారం ఫొటోలు, బ్యాంక్ అకౌంట్లను హ్యాక్ చేస్తారని హెచ్చరించారు. బ్యాంక్ ఏటీఎం వద్ద వృద్ధులు పక్కవారి సాయం తీసుకునే సమయాల్లో జాగ్రత్తలు వహించాలన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930కి సమాచారం అందించాలని సూచించారు. త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, సైబర్ పోలీస్ స్టేషన్ ఎస్సై మధు వెంకటరాజా సోషల్ మీడియా అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వృద్ధుల సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు


ఏలూరు జీజీహెచ్‌లో డీ అడిక్షన్ సెంటర్ వద్ద వైద్యులతో ఎక్సైజ్ అధికారులు

ఏలూరు టౌన్ : యువత, విద్యార్థులు, ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఏలూరు సీఐ జీఎస్ కృష్ణధనరాజు అన్నారు. ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీలత, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఏలూరులో అశోక్‌నగర్‌లోని ఎస్‌పీడీపీటీ జూనియర్ కాలేజీ, ఏలూరు జీజీహెచ్‌లోని డీ అడిక్షన్ సెంటర్‌లో డ్రగ్స్, నార్కోటిక్స్‌పై అవగాహన కల్పించారు. సరదాగా మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితంలో తీవ్రంగా నష్టపోతారని కృష్ణధనరాజు అన్నారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల విషయంలో యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏలూరు జీజీహెచ్ వైద్యులు, ఎక్సైజ్ శాఖ ఎస్సై పి.సుధీర్, గౌరీశంకర్ తదితరులు ఉన్నారు.

ఏఎంసీ మాజీ చైర్మన్‌కు జేపీ పరామర్శ


రామ్మోహన్‌రావును పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త జయప్రకాష్, నేతలు

ఏలూరు టౌన్ : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ పట్టగర్ల రామ్మోహన్‌రావును ఆయన నివాసంలో పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, తామంతా ఎప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. పూర్తిస్థాయిలో ఆరోగ్యంతో కోలుకుని, పార్టీ బలోపేతానికి పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, మాజీ కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, మాజీ కార్పొరేటర్ కిలాడి దుర్గారావు, పార్టీ నాయకులు ఫణి తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

పెదవేగి : సమాజంలో ప్రతి మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. ఆయన అధ్యక్షతన శనివారం పెదవేగి ఎంపీడీఓ కార్యాలయంలో విధాన్ సే సమాధాన్ (చట్టంతో పరిష్కారం) ఫర్ ఉమెన్ బ్లాక్ లెవెల్-2 మహిళ చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ మహిళా అభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలు, వారి రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల ఫోన్లను తగు జాగ్రత్తతో ఉపయోగించుకోవాలని సూచించారు. ఉచిత న్యాయ సహాయం 15100కి కాల్ చేసి పొందవచ్చన్నారు. జిల్లా కోర్టు పరిధిలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ ద్వారా నేరం మోపబడిన వారందరికీ ఉచితంగా కేసులు వాదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఉమెన్ కమిషన్ మెంబర్ బి.వినీత, న్యాయవాదులు జి.మేరీ సునీత, తిగిరిపల్లి సుబ్బారావు, ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొనే సీతారాం, పెదవేగి సీఐ వెంకటేశ్వరరావు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పీవీఎస్ మునీశ్వరరావు, డీసీపీఓ సూర్య చక్రవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆటుపోట్లతో సార్వా వరి సాగు

- వాతావరణ మార్పులతో ఉరుకులు, పరుగులు
- రైతులకు అవస్థలు

గణపవరం: సార్వా వరి సాగు ఆరంభం నుంచి ఆటుపోట్లతోనే సాగుతోంది. చివరి దశలోనూ రైతులకు అవస్థలు తప్పడంలేదు. పంట చేతికందిన సమయంలో వాతావరణంలో మార్పులు రైతులను కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. పంటను సజావుగా అమ్ముకోవడానికి వారు ఆరాటపడుతున్నారు. ధాన్యం రాశుల వద్ద ప్లాస్టిక్ బరకాలు, టార్పాలిన్‌లతో కాపలా కాస్తున్నారు. రైతులు ధాన్యం ఎండబెట్టడం, ఎండబెట్టిన ధాన్యాన్ని రాశులు చేసి బరకాలు కప్పుకుంటూ నానా హైరానా పడుతున్నారు. వారం రోజులుగా వాతావరణం అనుకూలంగా మారిరోజూ ఎండకాయడంతో రైతులు మాసూళ్లు ముమ్మరం చేశారు. ఎక్కడ చూసినా రైతులు ధాన్యాన్ని ఎండబెడుతూ కనిపిస్తున్నారు. ఎండలు కాస్తున్నా, వారం రోజులుగా మంచుకూడా ఎక్కువగా కురుస్తుండటంతో ధాన్యంలో తేమశాతం తగ్గడానికి సమయం పడుతుంది. ఇప్పటికే పూర్తిగా ఆరిన ధాన్యం రాశులు చేసి బరకాలు, టార్పాలిన్లు కప్పారు.

రైతులకు మద్దతు ధర

తేమశాతం 17లోపు తీసుకురావడానికి రైతులు నానాపాట్లు పడుతున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో సుమారు 80 వేల ఎకరాల్లో సార్వా సాగు చేయగా, ఇందులో 50 నుంచి 60 శాతం ధాన్యాన్ని మిల్లులకు తరలించగా, 50 శాతం రైతులు వరి కోతలు పూర్తిచేసి, ధాన్యం రాశులు రోడ్లు, పుంతగట్లు, ఖాళీ ప్రదేశాలకు ఆరబెట్టుకుంటున్నారు. తేమ శాతం 17లోపు వస్తేనే ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుంది.

నెలాఖరుకు కోతలు పూర్తి

ఉంగుటూరు నియోజకవర్గంలోని భీమడోలు, ఉంగుటూరు మండలాలలో దాదాపు 80 శాతం మాసూళ్లు పూర్తికాగా, గణపవరం, నిడమర్రు మండలాలలో 50 శాతం పూర్తయ్యాయి. ఈ నెలాఖరుకు


వర్షానికి తడవకుండా ధాన్యం రాశులపై కప్పిన ప్లాస్టిక్ బరకాలు

దాదాపు వరికోతలన్నీ పూర్తవుతాయని అంచనా వేస్తున్నారు. అప్పటి వరకు వాతావరణం అనుకూలిస్తే అందరూ గట్టెక్కుతామని చెబుతున్నారు.

ఆరంభం నుంచి కష్టాలే

సార్వా నారుమడుల దశలోనూ, వరినాట్ల దశలోను కురిసిన భారీ వర్షాలకు రైతులు రెండోసారి నారుమడులు, వరినాట్లు వేశారు. కొందరు మూడోసారి కూడా నాట్లు వేయాల్సివచ్చింది. దీంతో పెట్టుబడులు అమాంతం పెరిగిపోయాయి. ఎకరాకు ఐదారు వేల రూపాయలు అదనంగా ఖర్చుచేశారు.

తగ్గిన దిగుబడి

సార్వా దిగుబడులు ఎకరాకు 40బస్తాలకు మించడంలేదు. కొన్ని చోట్ల 35 బస్తాలనుంచి 40 బస్తాల మధ్యలోనే ఉంటుంది. ఇలాంటి రైతులకు నష్టాలు తప్పడంలేదు. నికరంగా 40 బస్తాలు వస్తే


ధాన్యం ఎండబెడుతున్న రైతు

20బస్తాలు మక్తాపోను, మిగిలిన దానితో కనీసం పెట్టుబడులతో బయటపడే అవకాశం ఉందని, అంతకుతగ్గితే ఆమేరకు రైతులకు చేతిచమురు తప్పదనిఅంటున్నారు.

కష్టానికి తగిన ఫలితం లేదు



సార్వా సాగులో రైతులకు కష్టానికి ఫలితం దక్కే పరిస్థితి లేదు. ఐదెకరాలు కౌలుకు చేస్తున్నాను. ఎకరాకు 40 బస్తాలు దిగుబడి వచ్చింది. 20 బస్తాలు కౌలు పోను మిగిలిన 20 బస్తాలు పెట్టుబడికి సరిపోతాయి. ఆరుగాలం పడ్డ శ్రమ అంతా వృథాయే. కనీసం పెట్టుబడివస్తే చాలు అనుకునే పరిస్థితి. సార్వా ఆరంభంలో భారీ వర్షాలకు నారుమడులు, వరినాట్లు దెబ్బతినడంతో రెండుసార్లు వేయడంతో పెట్టుబడి పెరిగిపోయింది. కోత యంత్రాలు లేకుండా రైతుకు ఎకరాకు ఏడెనిమిది వేల రూపాయలు అదనంగా ఖర్చయ్యేది.

– సింగులూరు సత్యం, కౌలురైతు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	02
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	27

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	18
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	20
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	12
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	15
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	16
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	18
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	04
ఏలూరు - తిరుపతి	16.00	4830	31

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	38	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	07, 10
బెండకాయలు	30	కంద	80
పచ్చిమిర్చి	24-28	బీట్‌రూట్	60
కాకర కాయలు	30	కీరా దోస	32
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	68
బీరకాయలు (పందిరి)	40	అల్లం	70
క్యాబేజీ	36	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	70	పాలకూర	12
దొండకాయలు	30	చుక్కకూర	15
బంగాళదుంపలు	38	తోటకూర	10
ఉల్లిపాయలు	36-55	గోంగూర	07
గోరుచిక్కుడు	36	పుదీనా	05
దోసకాయలు	24-28	బఠాణీ	--
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	46